# కామ్రేడ్స్ కోరన్న, మంగన్నల వర్ధంతి సభ



శ్రీకాకుళంలో కామ్రేడ్స్ కోరన్న, మంగన్నల వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥టి.అరుణ

**పార్వతీపురం, 30-10-19:**

**1967 అక్టోబర్ 31న భూస్వాముల గుండాల కాల్పుల్లో నేలకొరిగిన మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న, మంగన్నలకు విప్లవ జోహార్లు తెలియజేస్తూ 52వ వర్ధంతిసభ పార్వతీపురం సామాజిక గిరిజన భవనంలో ఘనంగా జరిగింది.**

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు పార్వతీపురం, కొమరాడ, కురుపాం, మక్కువ, సాలూరు, పాచిపెంట తదితర మండలాలనుండి వందలాది మంది గిరిజనులు, గిరిజనేతర పేదలు హాజరయ్యారు. గిరిజన నాయకుడు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షుడు కద్రక వెంకటస్వామి ఈ సభకు అధ్యక్షత వహించాడు. ఈ సభకు ముఖ్యవక్తగా హాజరైన రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర సహాయకార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం భూమి, భుక్తి, విముక్తికోసం జరిగిన పోరాటమని ఈ ఉద్యమంలో తొలి అమరులు కోరన్న, మంగన్నలతోపాటు 360 మంది కామ్రేడ్స్ నేల కొరిగారని గుర్తుచేస్తూ పాలకులు మారుతున్నా గిరిజనుల మౌలిక సమస్యలైన భూమి, అడవిపై హక్కు నేటికి పరిష్కారంకాలేదని, అడవినుండి ఆదివాసీలను ఖాళీచేయించడానికి నిరంతరం కుట్రలు జరుగుతున్నాయని, అడవిని, అడవిలోని సంపదలను బహుళజాతి కంపెనీలకు అప్పజెప్ప డానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని దీనికి వ్యతిరేకంగా ఉద్యమించడమే కోరన్న, మంగన్నలకు ఇచ్చే నిజమైన నివాళని పిలుపు నిచ్చారు. ఈ సభలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు మాట్లాడుతూ 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం నేటికీ పూర్తిగా అమలుచేయలేదని, శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం ఫలితంగా ఐటిడిఏలు వచ్చినా కనీస సౌకర్యాలైన మంచినీరు, రహదారులు, వైద్యం, విద్య ఇంకా ఆమడ దూరంలోనే వున్నాయని విమర్శించారు. ఈ సభలో రైతుకూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొత్స నరసింగరావు, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకమిటీ సభ్యులు మెరగాని గోపాలం, రైతకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు పి.శ్రీనునాయుడు, మోణంగి భాస్కరరావు తదితరులు ఉపన్యసించారు. అమరులకు జోహార్లు తెలియజేస్తూ ప్రజాకళాకారులు పాడిన పాటలు సభను ఉత్తేజపర్చాయి.

**శ్రీకాకుళం, 31-10-19:**

శ్రీకాకుళంజిల్లా కమ్యూనిస్టు విప్లవోద్యమ అమరుల స్థూపందగ్గర రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో కా॥కోరన్న, మంగన్నల వర్ధంతి సభ జరిగింది. తొలుత అమరస్థూపంవద్ద పూలమాలలు వేసి మృతవీరులకు నివాళులర్పించారు. ఎర్రజెండాను ఆవిష్కరించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ అమరులను స్మరించటమంటే వారి ఆశయ సిద్ధికి దీక్ష వహించటమేనన్నారు. "ప్రజలకు కావల్సింది పథకాల బిచ్చాలు కాదు; చేతినిండా పనికావాలి, దున్నేందుకు భూమి కావాలి, ఆత్మగౌరవం కావాలి, అందుకు ప్రజలు పోరాటాల్లోకి రావాలి. గిరిజనులు, దళితులు, మహిళలు, సమాజంలోని వివిధ సెక్షన్ల ప్రజలెవరూ సుఖంగా, శాంతిగా లేరు. భూమిమీద, నీటిమీద, గాలిమీద, ఇసుక మీద ప్రజలకే హక్కు వుండాలి. సమాజంలో డబ్బుకోసం, స్వార్థంకోసం, నేరస్త స్వభావాన్ని పెంచే సామాజిక మాధ్యమాలు, టీవీలు, సినిమాలు, విచ్చలవిడిగా స్వైరవిహారం చేస్తున్నాయి. గిరిజనులను అడవినుండి తరిమి వేస్తున్నారు. వారికి వున్న కనీసపాటి హక్కులను కూడా కాలరాస్తున్నారు" అని వివరిస్తూ ఈ నేపధ్యంలో సమాజంలో ఆధిపత్యం వహిస్తున్న దోపిడీశక్తులకు వ్యతిరేకంగా పోరాడటానికి సంసిద్ధం కావాలన్నారు.

ఈ సభకు కామ్రేడ్ తాండ్ర అరుణ అధ్యక్షత వహించగా, రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥డి.వర్మ, ఏపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి కొప్పల భానుమూర్తి, సంఘం జిల్లా అధ్యక్షులు కా॥పోలారావు, తదితరులు మాట్లాడారు. ప్రజాకళాకారులు స్ఫూర్తిదాయకంగా పాటలు పాడారు.

౦౦౦